కేజ్రీవాల్‌కు మరో 4 రోజుల కస్టడీ

- ఈడీ కస్టడీని ఏప్రిల్ 1 వరకు పొడిగించిన ఢిల్లీ కోర్టు
- అంతకుముందు స్వీయ వాదనలు వినిపించిన కేజ్రీ
- ఆప్‌ను నాశనం చేయడానికి యత్నిస్తున్నారని ఫైర్
- స్కామ్ జరిగితే వంద కోట్లు ఎక్కడ ఉన్నాయని ప్రశ్న
- మద్యం పాలసీ కేసు రాజకీయ కుట్ర అన్న ఢిల్లీ సీఎం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈడీ కస్టడీని ఢిల్లీలోని రౌస్‌అవెన్యూ కోర్టు మరో నాలుగు రోజుల పాటు పొడిగించింది. ఏప్రిల్ 1న ఉదయం 11 గంటలకు ఆయన్ని కోర్టు ముందు హాజరుపరుచాలని ఈడీని ఆదేశించింది. గతంలో విధించిన ఏడు రోజుల కస్టడీ గురువారం ముగియడంతో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను న్యాయస్థానంలో హాజరు పరిచారు. దర్యాప్తు సమయంలో కేజ్రీవాల్ తప్పించుకునే ధోరణిలో సమాధానాలు చెప్పారని, డిజిటల్ డివైజ్‌ల పాస్‌వర్డ్‌లను కూడా చెప్పలేదని ఈడీ ఆరోపించింది. ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులతో కలిపి ఆయన్ని విచారించాల్సిన అవసరం ఉందని చెబుతూ.. మరో ఏడు రోజుల కస్టడీకి అప్పగించాలని ఈడీ కోర్టును అభ్యర్థించింది. అయితే, కోర్టు నాలుగు రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. కాగా అంతకు ముందు కేజ్రీవాల్ స్వయంగా కోర్టులో తన వాదనలు వినిపించారు.

ఆ వాంగ్మూలం సరిపోతుందా?

కోర్టులో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'దేశ ప్రజల ముందు ఆప్‌ను ఓ అవినీతి పార్టీగా చిత్రీకరించి, నాశనం చేయడానికి ఈడీ తొలి నుంచీ ప్రయత్నిస్తున్నది. నన్ను అరెస్టు చేసినప్పటి నుంచీ వాళ్లు (ఈడీ) చెబుతున్న రూ. 100 కోట్లను ఇంతవరకూ పట్టుకోలేదు. మద్యం కేసులో నన్ను అరెస్టు మాత్రమే చేశారు. అయితే నేను తప్పు చేశానని ఏ కోర్టులోనూ రుజువుకాలేదు. ఈ కేసుకు సంబంధించి సీబీఐ 31 వేల పేజీల ఛార్జ్‌షీట్, ఈడీ మరో 25 వేల పేజీల ఛార్జ్‌షీట్లను సమర్పించాయి. అయితే, వాటిని క్షుణ్ణంగా చదివిన తర్వాత కూడా నన్ను ఎందుకు అరెస్టు చేశారన్న ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకట్లేదు. ఇన్ని వేల పేజీల ఛార్జ్‌షీట్లలో నా పేరును నాలుగుసార్లు మాత్రమే ప్రస్తావించారు. అక్కడ కూడా అరవింద్ కేజ్రీవాల్ అని కాకుండా సీ అరవింద్ అని రాసి ఉంది. నిజానికి సీ అరవింద్ అనే వ్యక్తి మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా కార్యదర్శి. ఈడీ విచారణలో కూడా.. నాకు సిసోడియా కొన్ని డాక్యుమెంట్లు ఇచ్చాడని సదరు అరవింద్ చెప్పాడు. నాకు రోజూ ఎందరో ఎమ్మెల్యేలు ఎన్నో డాక్యుమెంట్లు ఇస్తారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో ఇదో భాగం. నా పేరును నలుగురు సాక్షులు ప్రస్తావించినట్టు ఈడీ చెప్తున్నది. ఒక సీఎంను అరెస్టు చేసేందుకు ఈ నాలుగు వాంగ్మూలాలు సరిపోతాయా? ఈడీ చెప్తున్నట్టు ఒకవేళ నిజంగా కుంభకోణం జరిగితే, ఆ రూ. 100 కోట్ల డబ్బు ఏది? ఎక్కడ? ఏదేమైనా ఈడీ విచారణను ఎదుర్కొనేందుకు నేను సిద్ధమే' అని చెప్పారు.

విచారణ అనంతరం రౌస్‌అవెన్యూ కోర్టు నుంచి బయటకి వస్తున్న కేజ్రీవాల్

ఇది 'రాజకీయ కుట్ర'

కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను రౌస్‌అవెన్యూ కోర్టులో హాజరుపరుచడానికి గురువారం ఈడీ అధికారులు కోర్టు ప్రాంగణంలోకి తీసుకెళ్తున్న సమయంలో అక్కడున్న మీడియాతో ఆయన మాట్లాడారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు 'రాజకీయ కుట్ర' అని.. దీనికి ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

గోవా ఆప్ నేతలను ప్రశ్నించిన ఈడీ

పనాజీ: ఇప్పటికే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను మద్యం పాలసీ కేసులో అరెస్ట్ చేసిన ఈడీ ఇప్పుడు గోవాపై దృష్టి సారించింది. మనీ లాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ గోవా యూనిట్ అధ్యక్షుడు అమిత్ పాలేకర్, మరో ముగ్గురిని ఈడీ గురువారం ప్రశ్నించింది. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై తమను ఈడీ అధికారులు ప్రశ్నించారని, అడిగిన పత్రాలన్నీ అందజేశామని వారు చెప్పారు. అధికార పార్టీ వేధింపులకు ఇది కేవలం ఆరంభం మాత్రమేనని పాలేకర్ ఆరోపించారు. విచారణకు మళ్లీ రమ్మనమని ఈడీ చెప్పలేదని, అయితే మరోసారి తనకు సమన్లు రావడం ఖాయమని ఆయన అన్నారు. కాగా, వారిని ఈడీ విచారించినంత సేపు ఎమ్మెల్యేలు వెంజీ వీగస్, క్రూజ్ సిల్వాలో కార్యాలయం బయట వేచి ఉన్నారు.

పంజాబ్‌లో 'ఆపరేషన్ కమలం'

న్యూఢిల్లీ: పంజాబ్‌లో 'ఆపరేషన్ కమలం' మొదలైందని ఆప్ సీనియర్ నాయకుడు సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. లోక్‌సభలో ఏకైక ఆప్ ఎంపీ సుశీల్ కుమార్ రింకూ బీజేపీలో చేరిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గురువారం భరద్వాజ్ విలేకర్లతో మాట్లాడుతూ, 'తమకు పెద్ద ఎత్తున ఫోన్ కాల్స్ వచ్చాయని పంజాబ్‌లోని ఆప్ ఎమ్మెల్యేలు చెప్పారు. బీజేపీలో చేరితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు, వై-క్యాటగిరి భద్రత, పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెబుతామని మా ఎమ్మెల్యేలకు ఆఫర్లు వచ్చాయి. ఇదంతా బీజేపీ చేపట్టిన 'ఆపరేషన్ కమలం'లో భాగం' అని అన్నారు. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగో స్థానంలో నిలిచిందన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎందుకు బీజేపీలో చేరారని రింకూను భరద్వాజ్ ప్రశ్నించారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లోనూ రింకూ పోటీ చేస్తున్న జలంధర్‌లో బీజేపీ నాలుగో స్థానంలో నిలుస్తుందని అన్నారు.

ఈడీ విచారణకు మహువా గైర్హాజరు

కోల్‌కతా, మార్చి 28: ఫెమా ఉల్లంఘనల కింద నమోదు చేసిన కేసులో ఢిల్లీలో ఈడీ విచారణకు టీఎంసీ మాజీ ఎంపీ మహువా మొయిత్రా గైర్హాజరయ్యారు. ఈ కేసులో ఈ నెల 28న తమ ముందు హాజరు కావాలంటూ ఆమెకు, దుబాయ్ వ్యాపారవేత్త దర్శన్ హీరానందనీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. తాను పోటీ చేస్తున్న కృష్ణానగర్‌లో గురువారం ప్రచారం నిర్వహించాల్సి ఉన్నందున గురువారం నాటి ఈడీ విచారణకు హాజరు కావడం లేదని మహువా తెలిపారు. అనంతరం ఆమె ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా నదియా కాళీగంజ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ 'ఈడీ తన పని తాను చేస్తుంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ నా పని నేను చేస్తాను' అని వ్యాఖ్యానించారు. మహువాను విచారణకు రమ్మంటూ ఈడీ ఇదివరకే రెండు సార్లు నోటీసులు జారీ చేసినా ఆమె హాజరు కాలేదు.

సంస్కరణలు తెచ్చింది కాంగ్రెస్ కాదు

- పీవీ, మన్మోహన్ వల్లే సంస్కరణలు
- ప్రముఖ రచయిత గురుచరణ్‌దాస్



న్యూఢిల్లీ, మార్చి 28: దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టింది తామేనని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ గొప్పగా చెప్పుకుంటూ ఉంటుంది. అయితే, ఇందులో ఎంతమాత్రమూ నిజం లేదని ప్రముఖ రచయిత, ప్రొక్టర్ అండ్ గ్యాంబుల్ మాజీ సీఈవో గురుచరణ్‌దాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన పుస్తకం 'ద డైలెమా ఆఫ్ యాన్ ఇండియన్ లిబరల్' లాంచింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, ఆర్థికశాఖమంత్రి మన్మోహన్‌సింగ్ తప్ప కాంగ్రెస్ కాదని స్పష్టం చేశారు. ''మనం నెమ్మదినెమ్మదిగా సంస్కరణల వైపు అడుగేశాం. కారణం నరసింహారావు, మన్మోహన్‌సింగే. వారిచుట్టూ ఉన్నవారు సొంతపార్టీని కూడా ఒప్పించలేకపోయారు. కాబట్టి సంస్కరణలు చేసింది కాంగ్రెస్ పార్టీ కాదు. నిజం చెప్పాలంటే రావు (నరసింహారావు)తో పార్టీ ఎంతో అసంతృప్తికి గురైంది' అని జన్నలిస్టు షోమా చౌదరితో మాట్లాడుతూ చెప్పారు. భారత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ.. బలమైన ఆర్థిక వ్యవస్థ కలిగి ఉన్నప్పటికీ ప్రజాస్వామ్యం బలహీన పడడం ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పీకింగ్ టైగర్ బుక్స్ ప్రచురించిన 'ద డైలెమా ఆఫ్ యాన్ ఇండియన్ లిబరల్' ప్రస్తుతం ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్ స్టోర్లలోనూ కొనుగోలుదారులకు అందుబాటులో ఉంది.

నెట్ స్కోర్‌తో పీహెచ్‌డీ అడ్మిషన్లు

- **2024-25 నుంచే అమల్లోకి**
- **అన్ని వర్సిటీలకు ఆదేశాలు**
- **యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్**



న్యూఢిల్లీ, మార్చి 28: పీహెచ్‌డీ అడ్మిషన్లకు యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించే అవసరం లేకుండా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) స్కోర్ ఆధారంగానే అడ్మిషన్లు కల్పించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. 2024-25 నుంచే దీన్ని అమలుచేయాలని అన్ని విశ్వవిద్యాలయాలకు సూచించింది. 2024 జూన్ సెషన్‌కు సంబంధించి వచ్చే వారం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించేందుకు ఎన్టీఏ కసరత్తు చేస్తున్నట్టు యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ ట్వీట్ చేశారు. ఏడాదికి రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో నెట్ పరీక్షను ఎన్టీఏ నిర్వహిస్తుంది. ప్రస్తుతం జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్) ప్రదానానికి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకానికి నెట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నారు. నిపుణుల కమిటీ సిఫారసు మేరకు నెట్ స్కోర్‌ను పీహెచ్‌డీ అడ్మిషన్లకు కూడా పరిగణనలోకి తీసుకోవాలని తాజాగా నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

కొలువుల కోన.. తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

ఇంజిన్ సర్కారు ఉన్న గుజరాత్ 5, ఉత్తరప్రదేశ్ 19 స్థానాల్లో నిలిచాయి. ఐఎల్‌వో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్(ఐహెచ్‌డీ)ఈ నివేదికను ప్రచురించాయి.

గత కాంగ్రెస్ కంటే ఎంతో మిన్న: 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఏపీలో భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాలు 24,086 మాత్రమే. అందులో తెలంగాణ 10 జిల్లాల వాటా 42 శాతం అనుకుంటే.. మనకు దక్కినవి కేవలం 10,080 ఉద్యోగాలే. అదే.. తెలంగాణ ఏర్పడిన తర్వాత.. అంటే 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య 2.32 లక్షలు. ఈ లెక్కన తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటితో పోలిస్తే బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 23 రెట్లు ఎక్కువ ఉద్యోగాలు భర్తీ చేసింది. గత కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ఏడాదికి సగటున వెయ్యి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే.. బీఆర్‌ఎస్ పాలనలో 2014 తర్వాత ఏడాదికి సగటున 23 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. ఏ లెక్కన తీసుకున్నా బీఆర్‌ఎస్ సర్కారు భర్తీ చేసిన ఉద్యోగాలతో పోలిస్తే కాంగ్రెస్ భర్తీ చేసిన ఉద్యోగాలు దరిదాపులో కూడా ఉండవు. ప్రభుత్వ రంగంలోనే కాదు అటు ప్రైవేటు రంగంలో కూడా గత పదేండ్ల వ్యవధిలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్తగా 17 లక్షల ఉద్యోగాలను సృష్టించి ఉపాధి కల్పనలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపింది.

న్యాయవ్యవస్థపై ఒత్తిళ్లు

- కోర్టు తీర్పులపై దుష్ప్రచారం
- ఇది కొన్ని స్వార్థమూకల పనే
- వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సిందే
- సీజేఐకు 600 మంది న్యాయవాదుల లేఖ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దేశ న్యాయవ్యవస్థపై ఒత్తిళ్లు తీసుకొచ్చి, న్యాయస్థానాల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కొన్ని స్వార్థమూకలు కుట్రకు తెగబడుతున్నాయని సీనియర్ న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ సమగ్రతను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ కుట్రలు కొనసాగుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా రాజకీయ నేతలకు సంబంధించిన అవినీతి కేసుల్లో కోర్టు తీర్పులను ప్రభావితం చేసేందుకు ఈ ఒత్తిళ్లు పెరుగుతున్నట్టు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు హరీశ్ సాల్వే, బార్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మనన్ కుమార్ మిశ్రా సహా 600 మందికి పైగా న్యాయవాదులతో కూడిన బృందం సీజేఐ డీవై చంద్రచూడ్‌కు ఓ లేఖ రాశాయి.

సోషల్‌మీడియాలో తప్పుడు కథనాలు

'రాజకీయ అజెండాతో స్వార్థ ప్రయోజనాలను ఆశించి కొన్ని గ్రూప్‌లు న్యాయవ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. కోర్టులపై ప్రజల్లో విశ్వాసాన్ని తగ్గించేందుకు తెగబడుతున్నాయి. ఇందుకోసం కోర్టులు ఇచ్చిన కీలక తీర్పులపై సోషల్‌మీడియాలో తప్పుడు కథనాలు సృష్టిస్తున్నాయి. ఈ మధ్య కొందరు న్యాయవాదులు పగటిపూట రాజకీయ నేతలను సమర్థించడం, రాత్రి మీడియా ద్వారా జడ్జిలను ప్రభావితం చేయడం వంటి అంశాలు బాధ కలిగిస్తున్నాయి' అని లాయర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

రెండు విషయాలు బాధాకరం

ప్రస్తుతం జరుగుతున్న రెండు విషయాలు తమను ఎంతో బాధకు గురిచేస్తున్నాయని న్యాయవాదుల బృందం లేఖలో పేర్కొంది. 'అవినీతికి పాల్పడ్డారని బయట విమర్శించిన కొందరు రాజకీయ నేతలు.. కోర్టులోపలికి వచ్చేసరికి మాట మార్చేస్తారు. వారితో ఏకీభవించే విధంగా కోర్టు తీర్పు రాకపోతే.. న్యాయస్థానం లోపలే తీర్పును తప్పుబడుతున్నారు. బయట మీడియా ముందు కూడా ఇదే ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రెండు నాల్కల ధోరణి ఎంతో ప్రమాదకరం. ఇక రెండోది.. తమకు అనుకూలమైన తీర్పులు ఇచ్చేలా కొందరు న్యాయమూర్తులను ప్రభావితం చేస్తున్నారు. దీనికోసం వారిపై సోషల్‌మీడియాలో దుష్ప్రచారానికి కూడా వెనుకాడట్లేదు. ఇది కోర్టుల సమగ్రత, చట్టపరమైన సూత్రాలను కాలరాయడమే' అని న్యాయవాదుల బృందం లేఖలో పేర్కొంది. వ్యక్తిగత, రాజకీయ కారణాలతో కోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి ప్రయత్నాలను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదని పేర్కొన్న లాయర్ల బృందం.. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీజేఐను కోరింది.

బీజేపీ, కాంగ్రెస్ వాగ్యుద్ధం

న్యాయవాదుల లేఖ వ్యవహారంపై బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం విమర్శలకు దిగాయి. కాంగ్రెస్‌ను విమర్శిస్తూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'బెదిరించడం, వేధించడం కాంగ్రెస్ సంస్కృతి. ఐదు దశాబ్దాల క్రితం వారే కేంద్రానికి కట్టుబడి ఉండే న్యాయవ్యవస్థ కావాలని పిలుపునిచ్చారు. వాళ్ల స్వార్థ ప్రయోజనాలకు ఇతరులు నిబద్ధతతో ఉండాలని నిస్సిగ్గుగా కోరుకుంటున్నారు. కానీ, వాళ్లు మాత్రం దేశం పట్ల ఎలాంటి నిబద్ధతతో ఉండరు. 140 కోట్ల మంది భారతీయులు వాళ్లను తిరస్కరించడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు.' అని మోదీ పేర్కొన్నారు. మోదీ విమర్శలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టారు. 'ఒక వ్యవస్థ తర్వాత మరో వ్యవస్థను వేధించింది మీరే. మీ పాపాలకు కాంగ్రెస్‌ను బదనాం చేయడం ఆపండి. ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేయడంలో, రాజ్యాంగాన్ని దెబ్బతీయడంలో మీరు నిపుణులు' అంటూ పోస్ట్ చేశారు.

'నోటా' బాటలో కన్నడ రైతులు

- **బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే**
- **2 పార్టీలకు వ్యతిరేకంగా ఓటు**

బెంగళూరు: కర్ణాటకలో రైతు సంఘాలన్నీ ఏకమవుతున్నాయి. రైతుల బాధలు పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని భావిస్తున్నాయి. ఇందుకోసం లోక్‌సభ ఎన్నికల్లో 'నోటా' అస్త్రాన్ని ఉపయోగించుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించాయి. ఇప్పటికే కర్ణాటక రాజ్య రైతు సంఘ, హసిరు సేనె సంఘాలు ఎన్డీఏకు వ్యతిరేకంగా ఓటు వేయాలని రైతులను కోరుతూ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా రైతులకు చేసిందేమీ లేదని, ప్రస్తుతం తీవ్ర కరువును ఎదుర్కొంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదనే భావనతో పలు రైతు సంఘాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో రైతులను బీజేపీ, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సంఘటితం చేయాలని భావిస్తున్నాయి. ఇందులో భాగంగా భారత చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో మైసూరులో ఏప్రిల్ 3న రైతు సంఘాల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలోనే లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రణాళికను ఖరారు చేయనున్నారు. ఇప్పటికే బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నో టాకు ఓటు వేయాలని రైతు సంఘాలు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చా యి. దీని పై ఏప్రిల్ 3న తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపాయి.



కేఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు చామరాజ

'రెండో విడత' నామినేషన్లు షురూ

12 రాష్ట్రాల్లోని 88 సీట్లకు ఏప్రిల్ 26న పోలింగ్

న్యూఢిల్లీ, మార్చి 28: రెండో విడతలో భాగంగా 12 రాష్ట్రాల్లోని 88 లోక్‌సభ నియోజకవర్గాలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ 88 సీట్లకు ఏప్రిల్ 26న పోలింగ్ నిర్వహించనున్నారు. నామినేషన్ల దాఖలుకు ఏప్రిల్ 4 ఆఖరు తేది. జమ్ము కశ్మీర్‌లో ఏప్రిల్ 6న, మిగతా అన్ని స్థానాల్లో ఏప్రిల్ 5న స్క్రూటినీ జరగనుంది. అవుటర్ మణిపూర్ స్థానంలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ దశలోనే పోలింగ్ జరగనుంది.



238 సార్లు ఓడినా మళ్లీ బరిలోకి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, 28 మార్చ్ (నమస్తే తెలంగాణ): ఎందులోనైనా ఓటమిని అంగీకరించకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించే మనిషిని విక్రమార్కుడితో పోలుస్తుంటారు. మన చందమామ కథల్లోని విక్రమార్కుడి కథ వినని వారుండరు. తమిళనాడుకు చెందిన పద్మరాజన్ విక్రమార్కుడిని మించిపోయాడు. ఇతను ఇప్పటి వరకు 238 సార్లు ఎన్నికల్లో ఓడిపోయినా.. మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యాడు. తమిళనాడులోని మెట్టూరుకు చెందిన కే పద్మరాజన్ 1988లో మొదటిసారి మెట్టూరు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రపంచంలోనే ఎక్కువసార్లు ఓడిపోయిన వ్యక్తిగా రికార్డు సాధించాడు. ఇతని పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో కూడా నమోదైంది. టైర్ పంచర్ షాప్ నడిపిస్తూ జీవనం సాగించే 65 ఏండ్ల కే పద్మరాజన్ ఈసారి తమిళనాడులోని ధర్మపురి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. స్థానిక ఎన్నికల నుంచి రాష్ట్రపతి ఎన్నికల వరకు అన్ని ఎన్నికల్లో పోటీ చేసిన ఘనుడు పద్మరాజన్.

కోటాలో మరో నీట్ అభ్యర్థి ఆత్మహత్య

ఈ ఏడాది ఇప్పటివరకు ఏడుగురి బలవన్మరణం

కోటా, మార్చి 28: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. సోమ్యా కుర్మి అనే విద్యార్థిని బుధవారం అర్ధరాత్రి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్టు డీఎస్పీ రాజేశ్ తెలిపారు. దీంతో కోటాలో ఈ ఏడాది ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల సంఖ్య ఏడుకు చేరింది. రెండు రోజుల కిందటే మరో నీట్ విద్యార్థి మహ్మద్ ఉరూజ్ ఆత్మహత్య చేసుకున్నాడు. యూపీలోని అమేథీకి చెందిన సోమ్యా ఏడాదిగా కోటాలో కోచింగ్ తీసుకుంటున్నది. గురువారం సోమ్యా తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు స్నేహితులు తెలిపారు.

విక్రమ్ 1 స్టేజ్ 2 పరీక్ష సక్సెస్: స్కైరూట్

హైదరాబాద్ : కలాం-250 పేరుతో అభివృద్ధి చేస్తున్న విక్రమ్-1 అంతరిక్ష ప్రయోగ వాహనంలోని రెండో దశను విజయవంతంగా పరీక్షించినట్టు హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ప్రకటించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లో బుధవారం 85 సెకన్ల పాటు ఈ పరీక్ష జరిపినట్టు పేర్కొన్నది. విక్రమ్-1లో అధిక సామర్థ్యం కలిగిన కార్బన్ కంపోజిట్ రాకెట్ మోటార్‌ను వినియోగిస్తున్నారు. ఇది ఘన ఇంధనంతో పని చేస్తుంది. భారత్‌లో ప్రైవేటు రంగంలో తయారుచేసిన అతిపెద్ద ప్రొపల్షన్ సిస్టమ్‌ని విజయవంతంగా పరీక్షించామని, భారత అంతరిక్ష పరిశ్రమలో మైలురాయి అని స్కైరూట్ సంస్థ సీఈవో పవన్ చందన పేర్కొన్నారు. ఈ ఏడాది విక్రమ్-1 ప్రయోగాన్ని చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ దిశగా ఇది కీలక అడుగు అని ఈ సంస్థ సహవ్యవస్థాపకుడు నాగభరత్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఈరోడ్ ఎంపీ మృతి

ఈరోడ్, మార్చి 28: పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ రాలేదని ఇటీవల ఆత్మహత్యా యత్నం చేసిన ఈరోడ్ ఎంపీ గణేశ్‌మూర్తి గురువారం కోయంబత్తూరు దవాఖానలో మరణించారు. ఆయన మృతి పట్ల తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. గణేశ్‌మూర్తి మృతిపట్ల వైకో కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మూర్తి కొడుకు, కూతురును పరామర్శించి తన సంతాపాన్ని తెలిపారు. ఈ దఫా లోక్‌సభ ఎన్నికల్లో అతనికి టికెట్ కేటాయించకపోవటంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని చెప్పటంలో ఏమాత్రం నిజం లేదని పేర్కొన్నారు.

శివసేనలో చేరిన నటుడు గోవిందా

ముంబై, మార్చి 28 (నమస్తే తెలంగాణ): బాలీవుడ్ నటుడు గోవిందా అహుజా మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన పార్టీలో గురువారం చేరారు. ముంబైలోని నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం ఆయన పోటీ చేసే అవకాశం ఉన్నది. గోవింద 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ముంబై నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2009 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. కాగా, బాలీవుడ్ నటీమణులు కరిష్మా కపూర్, కరీనా కపూర్ కూడా గురువారం సీఎం షిండేను కలిశారు. వారు కూడా రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉందని అంటున్నారు.

2.36 లక్షలు పలికిన 9 నిమ్మకాయలు

వంధ్యత్వం పోతుందని నమ్మకం

విల్లుపురం, మార్చి 28: తమిళనాడులోని విల్లుపురం ఆలయంలో నిర్వహించిన వేలంలో 9 నిమ్మకాయలు ఏకంగా రూ.2.36 లక్షలకు అమ్ముడుపోయాయి. ఆలయంలోని బల్లెంకు గుచ్చిన ఈ నిమ్మకాయలు తినటం వల్ల సంతాన సాఫల్యం పొందుతారని భక్తుల నమ్మకం. మురుగస్వామి ఆలయంలో ఏటా ఉత్తిరమ్ పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నిమ్మకాయలను వేలం వేస్తారు. సంతానం కోసం నిరీక్షిస్తున్న జంటలు పండుగ సందర్భంగా ఆలయాన్ని సందర్శించి నిమ్మకాయలను కొంటుంటారు. 9 రోజుల పాటు అమ్మవారి బల్లానికి గుచ్చిన నిమ్మకాయలను వేలం వేస్తారు. అందులో మొదటి రోజు వేలం వేసే నిమ్మకాయలకు ఎక్కడలేని డిమాండ్ ఉంటుంది.

ఇసుకకు ప్రత్యామ్నాయం!

- *మట్టి, కార్బన్‌డయాక్సైడ్‌తో కొత్త పదార్థం*
- *నిర్మాణ రంగంలో విప్లవాత్మక అడుగు*
- *20-22% అధిక మన్నిక, అధిక దృఢత్వం*
- *ఐఐఎస్‌సీ-బెంగళూరు శాస్త్రవేత్తల ఆవిష్కరణ*



బెంగళూరు, మార్చి 28: నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో ఇసుక కొరత ఒకటి. ఏ ఇల్లు కట్టాలన్నా, ఏ గోడ పేర్చాలన్నా ఇసుక అవసరం తప్పనిసరి. ఇప్పటికే ఉన్నదంతా తవ్వేస్తుండటంతో భవిష్యత్తులో ప్రత్యామ్నాయం కచ్చితం కానున్నది. ఈ నేపథ్యంలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు అద్భుత ఆవిష్కరణ చేశారు. కార్బన్ డయాక్సైడ్‌ను వినియోగించి కొత్త పదార్థాన్ని అభివృద్ధి చేశారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టిలోకి ప్రత్యేక పద్ధతుల ద్వారా కార్బన్ డయాక్సైడ్‌ను జొప్పించి నిర్మాణాల్లో వాడేలా తయారు చేశారు. ఈ ప్రక్రియతో కాల్షియం కార్బోనేట్ స్ఫటికాలు తయారవుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇవి ఇసుక, సిమెంట్ కన్నా 20-22 శాతం అధిక మన్నిక, అధిక దృఢత్వాన్ని కలిగి ఉంటాయని వెల్లడించారు. 'ప్రస్తుతం ఇసుక కొరత, కార్బన్ డయాక్సైడ్ వ్యాప్తి పర్యావరణానికి ఇబ్బందిగా మారాయి. దీన్ని అధిగమించేందుకు మేం కార్బన్ డయాక్సైడ్‌ను మట్టి, నిర్మాణ వ్యర్థాలతో కలిపి కొత్త పదార్థాన్ని రూపొందించాం' అని ఐఐఎస్‌కు చెందిన సెంటర్ ఫర్ సస్టయినబుల్ టెక్నాలజీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌరదీప్ గుప్తా తెలిపారు. తాము అభివృద్ధి చేసిన ఈ పదార్థం నిర్మాణాల్లో 30 శాతం సిమెంట్ వాడకాన్ని, 50 శాతం ఇసుక వాడకాన్ని తగ్గిస్తుందని వివరించారు. మరింత పరిశోధనలు సాగిస్తున్నామని, పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఇక మన 'టైమ్'

రుబీడియం అటామిక్ క్లాక్‌ను అభివృద్ధి చేసిన ఇస్రో

త్వరలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లతో సింక్

బెంగళూరు, మార్చి 28: ఇప్పటివరకు అమెరికాకు చెందిన నెట్‌వర్క్ టైమ్ ప్రొటోకాల్ ఆధారంగా పని చేస్తున్న భారత్‌లోని స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు ఇక నుంచి మన సొంత వ్యవస్థ ద్వారా పని చేయనున్నాయి. ఇందుకోసం ఇస్రో 'రుబీడియం అటామిక్ క్లాక్'ను అభివృద్ధి చేసి గత ఏడాది లాంచ్ చేసింది. త్వరలోనే దీనికి మన దేశంలోని స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లను సింక్ చేయనుంది. అటామిక్ గడియారాలు అత్యంత కచ్చితత్వంతో సమయాన్ని కొలుస్తాయి. అందుకే నావిగేషన్ ఉపగ్రహాల్లో కూడా ఈ అటామిక్ గడియారాలనే ఉపయోగిస్తారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా వినియోగిస్తున్న అటామిక్ గడియారాల్లో సీసియం అణువులను ఉపయోగిస్తున్నారు. ఈ గడియారంలో రుబీడియం అణువులను వినియోగించారు.

2029లో సమయాన్ని మార్చాలా?

- *భూభ్రమణంలో హెచ్చుతగ్గులు*
- *సమయంలో ఒక సెకను తొలగించాలి*
- *అమెరికా పరిశోధకుల వెల్లడి*

న్యూయార్క్, మార్చి 28: గ్లోబల్ వార్మింగ్ ప్రభావం సమయంపైన కూడా పడుతున్నదని అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు వెల్లడించారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ధ్రువపు మంచు కరుగుతున్నదని, దీని వల్ల భూమి తిరిగే వేగంలో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయని గుర్తించారు. దీని ప్రభావం సమయాన్ని లెక్కించడంపై పడుతున్నట్టు చెప్పారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలోని స్క్రిప్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషియానోగ్రఫీకి చెందిన పరిశోధకులు చేసిన ఈ అధ్యయనం వివరాలు నేచర్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వాతావరణ మార్పుల వల్ల అంటార్కిటికా, గ్రీన్‌ల్యాండ్ లాంటి ప్రాంతాల్లో వేగంగా మంచు కరిగి, ఆ నీళ్లు భూమధ్య రేఖ వైపుగా ప్రవహిస్తున్నట్టు చెప్పారు. ఫలితంగా భూమి తిరిగే వేగంలో మార్పులు చోటుకుచేసుకుంటున్నట్టు చెప్పారు. భూమి తన చుట్టూ తాను ఒకసారి తిరిగితే ఒక రోజు అవుతుందనే లెక్కలో ప్రతిరోజూ కొన్ని మిల్లీ సెకన్ల తేడా వస్తున్నట్టు శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కాబట్టి, సమయాన్ని, భూమి తిరిగే వేగానికి సరిపోయేలా మార్చడానికి గానూ 2029లో కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్(యూటీసీ) నుంచి ఒక సెకనను తగ్గించాలని సూచించారు. దీనినే 'నెగెటివ్ లీప్ సెకండ్' అంటారు. దీని ప్రభావం స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల వ్యవస్థపై పడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

కాంగ్రెస్‌ను వీడిన సంపన్న మహిళ

బీజేపీలోకి సావిత్రి జిందాల్

చండీగఢ్, మార్చి 28: దేశంలోనే అత్యంత ధనవంతురాలైన హర్యానా మాజీ మంత్రి సావిత్రి జిందాల్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఆమె కుమారుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ ఇప్పటికే పార్టీ మారి బీజేపీలో చేరడంతో తాను కూడా తన కుమార్తె సీమతో కలిసి కమలం పార్టీలో చేరుతున్నట్టు గురువారం ప్రకటించారు. 10 ఏండ్లుగా ప్రాతినిధ్యం వహించిన హిసార్ నియోజకవర్గ ప్రజలు, కుటుంబ సభ్యుల సలహా మేరకు తాను బీజేపీలో చేరినట్టు 84 ఏండ్ల సావిత్రి తెలిపారు. కాగా, కాంగ్రెస్ ఎంపీగా వ్యవహరించిన ఆమె కుమారుడు నవీన్ జిందాల్ ఆదివారం పార్టీని వీడి బీజేపీలో చేరి అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేస్తున్నారు.